సాక్షి సూర్యాపేట

శనివారం, 21, జూన్, 2025



ఆదర్శం.. ఆ ఉపాధ్యాయులు

తాము చదువు చెబుతున్న ప్రభుత్వ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించి ఆదర్శంగా నిలిచారు ఆ ఉపాధ్యాయులు. - 8లో



వరి విత్తనాలు సీజ్

నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల్లో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలను అధికారులు సీజ్ చేశారు. - 8లో

'సోషల్' సర్వీస్!

నారాయణపూర్ మండలం గుజ్జకు చెందిన శశికాంత్ 'మన ఊరు-మన గుజ్జ' పేరుతో సామాజిక సేవ చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం తగ్గింపు కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద డిస్ట్రిక్ట్ డి అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అనుధాన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. చెప్పారు.

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత : ఎస్పీ

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్ నిర్మూలన మన అందరి బాధ్యత అని, ఇందులో భాగంగా ఈనెల 26న డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగంతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, తెలంగాణ రాష్ట్ర పోలీస్ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు, వివిధ సంఘాల వారు ఈ అవగాహన కార్యక్రమాలల్లో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు పాటుపడాలని కోరారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



సబ్ జైలను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్

చివ్వెంల : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని సబ్ జైలును సందర్శించారు. జైలు పరిసరాలను పరిశీలించి, ఖైదీలను ఆరోగ్య సమస్యలు, ఆహార వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూపరింటెండెంట్ బి.సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. జైలులో ఉన్న ఖైదీలకు న్యాయవాదులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. లేనట్లయితే జిల్లా న్యాయ సేవాధికార కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే, ఉచితంగా న్యాయసేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బి.వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ పెండెం వాణి, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అర్వపల్లి : తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ అంజిరెడ్డి కోరారు. అర్వపల్లిలో శుక్రవారం జరిగిన ఉద్యమకారుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటిస్థలాన్ని, నెలకు రూ.25వేల ఫించన్‌ను ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా అర్వపల్లికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు దిర్శనపు కృష్ణమూర్తిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు కుదురుపాక ఉదయ్, లింగంపల్లి రమణ, దడిపల్లి వెంకట్, కుంభం మధు, శివ, యాదగిరి, కొమారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌లో ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం!

సూర్యాపేటటౌన్ : డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఓ ఉద్యోగి అయిన ఇన్‌చార్జి డెమో మనోహరరాణి రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. దీన్ని గమనించిన తోటి ఉద్యోగులు అడ్డుకున్నట్లు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి డెమో మనోహరరాణి మధ్య విభేదాలు ఉన్నట్టు సమాచారం. ఈ విషయమై డాక్టర్ చంద్రశేఖర్‌పై జిల్లా కలెక్టర్‌కు సైతం మనోహరరాణి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వివరణ కోరగా విధి నిర్వహణలో అలసత్వం తగదని మందలించిన విషయం వాస్తవమేనని, అందుకే తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

కొత్త అడ్మిషన్లు 5,289

ప్రభుత్వ స్కూళ్లలో పెరిగిన ప్రవేశాల సంఖ్య

- గతేడాది కంటే 475 అదనం
- మూతబడిన 12 స్కూళ్లను తెరిపించిన విద్యా శాఖ
- ముగిసిన బడిబాట కార్యక్రమం



తిరుమలగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : విద్యా శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముగిసింది. ఈ నెల 6న ప్రారంభమైన బడిబాట గురువారం (19వతేదీ)తో పరిసమాప్తం అయ్యింది. రోజువారీ ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడిబాటను కొనసాగించారు. దీంతో ఈ ఏడాది కొత్తగా 5,289 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకున్నారు. అయితే గతేడాది ఆగస్టు 31వ తేదీ వరకు 4,814 అడ్మిషన్లు రాగా ఈసారి అదనంగా 475 అడ్మిషన్లు పెరిగాయి. అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో పాఠశాలల్లో కొత్త అడ్మిషన్ల సంఖ్య పెరగనుందని జిల్లా విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థుల చేరిక ఇలా..

ప్రభుత్వ పాఠశాలలు మొత్తం	950
1వ తరగతిలో ప్రవేశం	2,038
ప్రైవేట్ నుంచి వచ్చినవారు	1,410
2 నుంచి 10వ తరగతి వరకు	1,841

కోదాడ మండలంలో అత్యధికంగా..

జిల్లాలో మొత్తం 950 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 182 ప్రభుత్వ ఉన్నత, 78 ప్రాథమికోన్నత, 690 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అలాగే తొమ్మిది మోడల్ స్కూల్స్, 18 కేజీబీవీలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలల్లో వీటిలో 75వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడిబాటలో ఇప్పటి వరకు 5,289 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు పొందగా ఇందులో కోదాడ మండలంలో అత్యధికంగా 708 మంది, మఠంపల్లి మండలంలో అత్యల్పంగా 79 మంది ఉన్నారు.

తెరుచుకున్న పాఠశాలల్లో 32 మంది చేరిక

జిల్లాలో మొత్తం 95 ప్రభుత్వ పాఠశాలలు గతేడాది విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డాయి. అయితే ఈ ఏడాది బడిబాట కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థుల చేరికతో 12 పాఠశాలలు తెరుచుకున్నాయి. చింతపాలెం మండలంలో ఎనిమిది ప్రాథమిక పాఠశాలలు మూత పడగా ఈ ఏడాది రెండు తెరుచుకున్నాయి. అలాగే జాజిరెడ్డిగూడెం మండలంలో నాలుగు మూతపడగా మూడు తెరిపించారు. మఠంపల్లిలో 10 పాఠశాలలు మూతపడగా ఒకటి, మేళ్లచెరువులో మూడు పాఠశాలలు మూతపడగా ఒకటి, నడిగూడెం మండలంలో ఐదు పాఠశాలలకు ఒకటి, పెన్‌పహాడ్ మండలంలో రెండు మూతపడగా ఆ రెండు తెరుచుకున్నాయి. తిరుమలగిరిలో నాలుగు పాఠశాలలు ఉండగా ఒక పాఠశాలను తెరిపించారు. తుంగతుర్తి మండలంలో ఎనిమిది పాఠశాలలు మూతపడగా ఒక పాఠశాలను తెరిపించారు. ఈ పాఠశాలల్లో మొత్తం 32 మంది విద్యార్థులు చేరారు.

సమష్టి కృషితోనే విజయవంతం



ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన బడిబాట కార్యక్రమం ఉపాధ్యాయుల సమష్టి కృషితో విజయవంతంగా ముగిసింది. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఇంటింటి ప్రచారం చేశాం. దీంతో ఈ ఏడాది అత్యధికంగా అడ్మిషన్లు వచ్చాయి. 12 మూతపడిన పాఠశాలలను తెరిపించాం.

– అశోక్, డీఈఓ

ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకం

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తూ నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. అలాగే జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ ప్రభుత్వ పాఠశాలలపై ఫోకస్ పెట్టారు. ఎప్పటికప్పుడు పాఠశాలలపై ఆరా తీస్తూ ఎంఈఓలు, హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందజేసి సన్మానించారు. దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు.



సూర్యాపేటలో మహిళలతో యోగా సాధన చేయిస్తున్న యోగా గురువు చాడ పాపిరెడ్డి

ఆరోగ్య'యోగ'ం

- నిత్య యోగాతో జ్ఞాపకశక్తి వృద్ధి, ఒత్తిడి దూరం
- మానసిక స్థిరత్వానికి ధ్యానం ఉపయోగం
- శారీరక సమతుల్యతకు యోగాసనాలు దోహదం
- యోగాపై ఆసక్తి చూపుతున్న నేటి యువత
- నేడు జాతీయ యోగా దినోత్సవం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : మనస్సు, వాక్కు, కర్మలను నియంత్రించుకోవడంతో పాటుగా శారీరక ప్రశాంతతను పొందేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుంది. ప్రస్తుత ఆధునిక జీవన శైలిలో ఒత్తిడి కారణంగా ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా వీటి నుంచి ఉపశమనం పొందవచ్చు. మన దేశంలో పుట్టిన యోగాను ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ అనుసరించడమే గాక ఐక్యరాజ్యసమితి జూన్ 21న యోగా దినోత్సవంగా ప్రకటించడం మన దేశానికి దక్కిన గౌరవంగా చెప్పొచ్చు.

యోగాపై పట్టణ ప్రజల ఆసక్తి

నిత్య యోగా సాధన రక్తంలో మలినాలను శుద్ధి చేస్తుంది. శరీరంలో ప్రాణవాయువు పెంచుకునే ప్రక్రియ యోగాతోనే సాధ్యమవుతుంది. ముఖ్యంగా నగరాల్లో ఉండే ప్రజలు జంక్‌ఫుడ్ తినడం కారణంగా వ్యాధులతో బాధపతుంటారు. అలాంటి వారు స్వతహాగా లేదా డాక్టర్ల సలహా మేరకు యోగా కేంద్రాలను ఆశ్రయిస్తూ వారి శారీరక సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

ఆరోగ్యంగా ఉండటమే గాక చురుకుగా తమ పనులను పూర్తి చేసేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుంది. నిత్యం యోగా చేయడంతో మానసిక ప్రశాంతత ఉంటుందని యోగా గురువులు చెబుతున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, తలనొప్పి, సైనస్, మలబద్ధకం, కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులు, అధిక బరువు, నిద్రలేమి, ప్రత్యేకంగా మగవారికి నరాల బలహీనత, గర్భిణులకు సుఖప్రసవం, మహిళలకు గైనిక్ సమస్యల నుంచి బయటపడేందుకు ప్రతి రోజూ యోగాసనాల వేయడం ద్వారా తగ్గించుకునే అవకాశం ఉంటుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు.

ఇరవై ఏళ్లుగా యోగసేవ



2014లో సూర్యాపేట ఉన్నత యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి వేల మందికి ఉచితంగా యోగా నేర్పిస్తున్నాను. ఉస్మానియా యూనివర్సిటీలోనూ యోగా కోర్సు ప్రారంభించారు. యోగా ఆరోగ్యానికే కాకుండా, ఆయుష్ శాఖలో ఉద్యోగం పొందేందుకు ఉపయోగపడుతుంది. నా వద్ద యోగా నేర్చుకున్న వారు ఆరోగ్యంగా ఉంటూ ఉపాధి కూడా పొందుతున్నారు. యువత కచ్చితంగా యోగా చేసి మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి.

– చాడ పాపిరెడ్డి, యోగా గురువు, సూర్యాపేట

2019 నుంచి యోగా చేస్తున్నా..



నేను 2019 నుంచి నిత్య యోగా చేస్తున్నాను. ప్రస్తుత కాలంలో తినే ఆహారం వల్ల చిన్న వయసులోనే జబ్బులు వస్తున్నాయి. దీనికి పరిష్కార మార్గంగా యోగా ఉపయోగపడుతుంది. ప్రాణాయామంతో బీపీ, ఒత్తిడి కంట్రోల్ అవుతుంది. మోకాళ్ల నొప్పులు, ఎముకలు, నరాల నొప్పులతో బాధపడే వారు యోగాసనాల ద్వారా వాటిని నయం చేసుకోవచ్చు.

– వేల్పుల సుధాకర్, నిత్య యోగా సాధకుడు, మాజీ కౌన్సిలర్, సూర్యాపేట

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

సూర్యాపేట : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు చేసేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వైద్యులను ఆదేశించారు. సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర వార్డు, టీబీ యూనిట్ వార్డు, జెరియాట్రిక్ కేర్ వార్డు, డే కేర్ కిమోథెరపీ వార్డు, జ్వరం, కోవిడ్ ఐసోలేషన్ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. వైద్యసేవలు, మందులు ఇస్తున్నారా లేదా అని పేషంట్లను అడిగి తెలుసుకొన్నారు. రోజూ బ్లడ్ టెస్టుల వివరాలు, రిజిస్టర్లలో నమోదు పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ లో మందుల లభ్యత గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం క్యాంపు నిర్వహించేటప్పుడు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఎంసీహెచ్ సెంటర్ భవనాన్ని సందర్శించి పనులను వేగవంతం చేయాలన్నారు. డి అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు స్థలం సేకరించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆర్‌ఎం డాక్టర్ వినయ్ ఆనంద్, డాక్టర్ లక్ష్మణ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

భానుపురి (సూర్యాపేట) : యువతీయువకుల మత్తు మందుకు బానిసలు కావొద్దని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ 2025లో భాగంగా నిర్వహించిన మిషన్ పరివర్తన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు జిల్లాలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను యువతకు అవగాహన కల్పించాలన్నారు. యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ 2025లో భాగంగా జూన్ 20న జిల్లా స్థాయి నశ్ర ముక్త కమిటీ మీటింగ్, జూన్ 21న యోగా దినోత్సవం, జూన్ 22 న డ్రగ్స్ నియంత్రణపై స్కూల్స్, కాలేజీల్లో సెమినార్స్ నిర్వహించాలని సూచించారు. జూన్ 23న అర్బన్ ప్రాంతంలో ప్రతి స్కూల్‌లో మొక్కలు నాటాలని సూచించారు. జూన్ 24న సోషల్ మీడియా వేదికగా యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ప్రతి అధికారి, విద్యార్థులు ప్రచారం చేయాలన్నారు. జూన్ 25న పాఠశాలలు, కళాశాలల్లోసెమినార్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలని సూచించారు. జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియపర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, అబ్కారి సూపరిటేడెంట్ లక్ష్మానాయక్, డీపీఓ యాదగిరి, డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పద్మావతి, సీడీపీఓ రూప, ఎఫ్‌ఆర్‌ఓ వినోద్, ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ జనార్దన్, రెడ్ క్రాస్ ప్రతినిధి గణేష్, సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.271.20 కోట్ల రైతు భరోసా నిధులు జమ

భానుపురి (సూర్యాపేట): రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకు జిల్లాలోని 2,61,912 మంది రైతుల ఖాతాల్లో రూ.271.20 కోట్ల నిధులు జమ అయ్యాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. వానాకాలం-2025 సీజన్‌కు సంబంధించి జిల్లాలో మొత్తం 2,89,371 మంది రైతులకు నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని పేర్కొన్నారు. రైతులు కొత్త పాస్ బుక్కులు (05.06.2025 రోజు వరకు) వచ్చిన వారు వ్యవసాయ విస్తరణాధికారులను కలిసి సరైన పత్రాలను సమర్పించాలని కోరారు.

రైతు భరోసా అందించాలి



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

తుంగతుర్తి : తమకు రైతు భరోసా రావడం లేదని తుంగతుర్తికి చెందిన గుడిపూడి ఆగారావు, శంకరమంచి రవీందర్ శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తుంగతుర్తిలో ఏఓ బాలకృష్ణకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగతుర్తి శివారులో తమకు మూడ కరాల లోపు ఉన్న వ్యవసాయ భూములకు గతంలో రైతు భరోసా అందిందని, గడచిన నాలుగు పర్యాయాలుగా ఆగిపోయిందన్నారు. ఇదే విషయమై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా విచారణ జరిపి రెవెన్యూ రికార్డులు సక్రమంగానే ఉన్నాయని తెలిపారన్నారు. కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. రైతు భరోసా ఇవ్వకపోగా మీ భూముల సర్వే నంబర్లు కనిపించడం లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతు భరోసా వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

మహోన్నత వ్యక్తులు అంబేద్కర్, జగ్జీవన్‌రామ్

- మంద కృష్ణమాదిగ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు
- పసునూర్‌లో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు, మంద కృష్ణమాదిగ

నాగారం : అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన మహోన్నత వ్యక్తులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. నాగారం మండలం పసునూర్ గ్రామంలో మాదిగ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, విగ్రహాల ఏర్పాటు కమిటీ చైర్మన్ మల్లెపాక అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుక్రవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జాతి గర్వించే మహనీయులని కొనియాడారు. ఆ మహనీయుల ఆశయాల సాధనలో భాగంగా కొనసాగిన 35 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అన్నారు. రాజ్యాంగ నిర్మాతగా సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు అంబేద్కర్ అన్నారు. దళిత జనోద్ధరణ కోసం జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, వాగ్గేయకారుడు గిద్దె రామనర్సయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుంకరి జనార్దన్, నాయకులు గంధమల్ల యాదగిరి, గుడిపాటి సైదులు, చింతకుంట్ల వెంకన్న, చిన్న శ్రీరాములు, చిప్పలపల్లి మల్లేష్, అయోధ్య, బాలయ్య, శ్రీను, కిషోర్, రాజయ్య, తోడుసు లింగయ్య, బిక్కి శ్రీను, సోమన్న, బొజ్జ సైదులు, పంది శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆయా అనుబంధ సంఘాల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఈవీ'లకు నో పవర్!

చార్జింగ్ సౌకర్యం లేక రోడ్డెక్కని ఎలక్ట్రిక్ బస్సులు

- ప్రత్యేక లైన్, సబ్‌స్టేషన్ ఏర్పాటులో అలసత్వం
- నల్లగొండ డిపోకు 15 రోజుల క్రితం వచ్చిన 40 ఎలక్ట్రిక్ బస్సులు
- వాటిని నార్కట్‌పల్లి డిపోలో ఉంచిన అధికారులు
- కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో డిపో దాటని బస్సులు



నార్కట్‌పల్లి డిపోలో నిలిపిన ఎలక్ట్రిక్ బస్సులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సు (ఈవీ)లకు చార్జింగ్ కష్టాలు వచ్చిపడ్డాయి. ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమైన చార్జింగ్ కోసం విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ నిర్మాణంలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఆ పనుల కోసం మూడు నెలల కిందటే టెండర్లు పిలిచినా కాంట్రాక్టు సంస్థ అలసత్వంతో ఈవీ బస్సులు రోడ్డెక్క లేదు. దీంతో నల్లగొండ డిపోకు కేటాయించిన 40 ఈవీ బస్‌లను నార్కట్‌పల్లి డిపోలో భద్రపరిచారు. సూర్యాపేట, నల్లగొండ డిపోలకు ఒకేసారి ఈవీ బస్‌లు వచ్చాయి. 11 కేవీ లైన్, సబ్‌స్టేషన్, ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణ బాధ్యతలను రెండుచోట్ల ఒకేసారి కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. సూర్యాపేటలో ఇప్పటికే ఆ పనులన్నీ పూర్తయి బస్‌లు రోడ్డెక్కగా, నల్లగొండలో మాత్రం పనుల్లో జాప్యం జరుగుతోంది.

పనుల్లో ఎడతెగని జాప్యం

ఖర్చులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఆర్టీసీ ఈవీ బస్‌లను తీసుకొస్తోంది. అందులో భాగంగా నల్లగొండ, సూర్యాపేట డిపోలకు ఎలక్ట్రిక్ బస్‌లను మంజూరు చేసింది. అందుకోసం ఈ రెండు డిపోల్లో ప్రత్యేకంగా 133/11 కేవీ లైన్, సబ్‌స్టేషన్ నిర్మించాల్సి ఉంది. వాటితోపాటు జనరేటర్ల ఏర్పాటు, ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఒకే కాంట్రాక్టర్ కాంట్రాక్టు పొందినప్పటికీ సూర్యాపేటలో పనులను ఎప్పుడో పూర్తి చేశారు. ఈ నెల 9వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూర్యాపేటలో ఈవీ బస్సులను ప్రారంభించారు. నల్లగొండ డిపోలో మాత్రం ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నా, ప్రత్యేక లైన్, సబ్‌స్టేషన్ పనుల్లో వేగం పుంజుకోవడం లేదు.

తాత్కాలిక లైన్‌తో తలెత్తనున్న సమస్యలు

నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి 133/11 కేవీ ప్రత్యేక లైన్‌ను డిపో వేయాల్సి ఉండగా.. ఆ విషయంలో కాంట్రాక్టు సంస్థ అలసత్వం ప్రదర్శిస్తోందని అధికారులే చెబుతున్నారు. అయితే బస్టాండ్ సమీపంలోని విద్యుత్ లైన్ నుంచి తాత్కాలికంగా డిపో వరకు లైన్ వేసేందుకు సిద్ధమయ్యారు. దానివల్ల మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రస్తుతం సుబాష్ విగ్రహం నుంచి వెళ్లే 133/11 కేవీ లైన్ పరిధిలో చాలా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లలో ఎక్కడ సమస్య వచ్చినా, సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుంటారు. ఆ సమయంలో ఆర్టీసీ ఛార్జింగ్ యూనిట్‌కు కూడా విద్యుత్ నిలిచిపోతుంది. దీంతో బస్‌లకు ఛార్జింగ్ విషయంలో అంతరాయం ఏర్పడుతుంది. జనరేటర్ ఉన్నా కొంత సమయం వరకే వస్తుంది. అందుకే మెయిన్ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక్ లైన్ కోసం ఆర్టీసీ.. విద్యుత్ శాఖకు డబ్బులను చెల్లించింది. కానీ కాంట్రాక్టు సంస్థ ఆ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తోంది.

నెలాఖరు వరకు రోడ్డెక్కేది అనుమానమే

ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాకు చేరి 15 రోజులు కావస్తోంది. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ పనులేవీ చేపట్టలేదు. ఇప్పటికిప్పుడు పనులు ప్రారంభించి.. రాత్రింబవళ్లు పనిచేసినా ఈ నెలాఖరు వరకు కూడా అవి పూర్తికావు. బస్ డిపోలో ఇప్పటివరకు జనరేటర్లను ఏర్పాటు చేసి, ఛార్జింగ్ పాయింట్ల పనులను మాత్రమే చేపట్టారు. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే వాటికి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటివరకు బస్సులు డిపోకు పరిమితం కావాల్సిందే.

కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చాం

నల్లగొండ డిపో వద్దకు విద్యుత్ లైన్ ఏర్పాటు, సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల విషయంలో జాప్యం చేస్తుండటంతో కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చాం. ప్రస్తుతం తాత్కాలికంగా సుభాష్ విగ్రహం వద్ద నుంచి వెళ్తున్న 133/11 కేవీ లైన్ నుంచి నుంచి ఆర్టీసీ డిపోకు లైన్ వేసే పనులు ప్రారంభిస్తామని చెప్పింది. ప్రత్యేకంగా లైన్ కావాలని ఆర్టీసీ అధికారులు అడిగారని.. ఆ పనులను కూడా త్వరలో ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తయ్యేలా చూస్తామని కాంట్రాక్ట్ సంస్థ చెప్పింది.

– వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ, నల్లగొండ

సోషల్ సర్వీస్!

- సోషల్ మీడియా ద్వారా గ్రామస్తుల బాగోగులు
- 'మన ఊరు-మన గుజ్జ' పేరుతో పేజీల నిర్వహణ
- పుష్కరకాలంగా కృషిచేస్తున్న యువకుడు శశికాంత్

ఫేస్‌బుక్... యూట్యూబ్... ఇన్‌స్టాగ్రామ్... వాట్సాప్... ఇలా సోషల్‌మీడియాను యువత సరదా కోసమో, వినోదం కోసమో వినియోగిస్తారనే భావన అనేక మందిలో ఉంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం గుజ్జ గ్రామానికి చెందిన శ్రీరామోజు శశికాంత్ మాత్రం వీటి వినియోగంతో సామాజిక సేవ చేస్తున్నారు. డిగ్రీ చేసిన ఈయన 'మన ఊరు–మన గుజ' పేరుతో ఆయా వేదికల్లో పేజీలు నిర్వహిస్తూ గ్రామానికి, గ్రామస్తులకు సేవ చేస్తున్నారు. 12 ఏళ్లుగా అప్రతిహతంగా తన కృషిని కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆలోచన మాత్రమే తనదని, ఆచరణలో మాత్రం గ్రామం మొత్తం పాలుపంచుకుంటోందని శశికాంత్ చెబుతున్నారు – సాక్షి ప్రతినిధి, నల్లగొండ



స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామ మహిళలకు స్వయం అభివృద్ధి, కుటీర పరిశ్రమల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశం (ఫైల్)

'మన ఊరు.. మన గుజ్జ' పేరుతో రూపొందించిన సింబల్

గుజ్జ నుంచి దేశ విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు అనేక మంది ఉన్నారు. వారితో పాటు ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరికీ ఎప్పటికప్పుడు ఊరి విశేషాలను చేరవేయడం.. అవసరమైతే వాళ్లు ఓ చేయి వేసి చేయూత అందించేలా చేయడం ఈ 'సోషల్ మీడియాల' గొప్పదనం. గుజ్జ యువతలో సేవాదృక్పథాన్ని నింపేలా 2013 నుంచి ఈ 'సామాజిక ఉద్యమం' కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గుజ్జ గ్రామస్తులకు ఊరిలో ఏం జరుగుతోంది? ఏయే పండుగలు ఎలా జరుగుతున్నాయి? తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఈ పేజీలు అందిస్తున్నాయి.

ఎందరో ఆపన్నులకు ఆసరాగా నిలిచి...

'మన ఊరు – మన గుజ్జ వేదికను శశికాంత్ ఆ గ్రామంలో ఉన్న, గ్రామం నుంచి వెళ్లి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తుల సహకారంతో ముందుకు నడిపిస్తున్నారు. హఠాన్మరణం పొందిన వారి కుటుంబాలకు, అనారోగ్యానికి గురైన వారికి, ఆసుపత్రిల్లో వైద్యం అవసరమైన వారికి ఆర్థిక సహాయం, తోడ్పాటు అందేందుకు ఈ ×మన ఊరు–మన గుజ్జ' పేజీలు పనిచేస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో మరణించిన గంగదేవి తిరుమలేష్ భార్య, నలుగురు పిల్లలకు, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నల్లగంటి చందుకు, మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆస్పత్రిలో చేరిన మంగ లింగమ్మకు వైద్యం కోసం, క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న గోపరాజు సాయి అర్జున్‌కు అవసరమైన డబ్బు సమకూర్చడంలోనూ ఈ పేజీలు కీలకపాత్ర పోషించాయి. వీరితో పాటు గ్రామంలో ఉన్న వృద్ధులు, విద్యార్థుల కోసమూ అనేక సహాయ కార్యక్రమాలు వీటి ద్వారా జరుగుతున్నాయి.

సంప్రదాయ, సంస్కృతులు చాటిచెప్పేలా..

శశికాంత్ గుజ్జ గ్రామస్తులతో కలిసి ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా సంప్రదాయ, సంస్కృతులు అందరికీ చాటిచెప్పడానికీ కృషిచేస్తున్నారు. వాటికి అద్దం పట్టేలా బతుకమ్మ పాటల పోటీల నిర్వహణ, గ్రామ చరిత్ర, గొప్పదనం వివరిస్తూ.. రెండు బతకమ్మ పాటలు రాసి, పాడించి చిత్రీకరణ చేయించారు. జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, వారి త్యాగాలు ఈ తరం యువతకు తెలిసేలా చేస్తూ వారిలో చైతన్యం నింపుతున్నారు. సేవ చేయాలన్న తపన, ఊరి కోసం పని చేయాలన్న సంకల్పం వారిలో పెరిగేందుకు కృషిచేస్తున్నారు.

గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహణ

ఈ సోషల్ మీడియా వేదిక ద్వారా పలువురిని ఆకర్షిస్తున్న శశికాంత్ వారితో గ్రామంలో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ మహిళల స్వయం ఉపాధి, స్వయం సమృద్ధి కోసం అవసరమైన ప్రాథమిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత నెలలో గుజ్జ రైతు వేదిక వద్ద స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తోట రాము సహకారంతో వృత్తి నైపుణ్యాల పెంపుదల, వివిధ పథకాల కింద రుణాలు పొందే అవకాశం, కుటీర పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్ సాయం పొందే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ వర్గాల్లో ఉన్నతంగా ఉన్న వారి సహాయ, సహకారంతో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే సేవ



గ్రామస్తుల సహకారంతోనే 'మన ఊరు– మన గుజ్జ' సోషల్ మీడియాను ప్రారంభించాను. గ్రామస్తులు ఒక్కొక్కరుగా చేరడంతో సోషల్ మీడియాలో గ్రామస్తులమంతా టీంగా ఏర్పడ్డాం. సహాయ, సహకారాల్లో గ్రామం మొత్తం భాగస్వామ్యమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతి గ్రామ పంచాయతీకి సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేయాలన్నది నా ఆకాంక్ష. అవకాశం ఉన్న వారు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తే ఇంకా మెరుగైన సేవలు అందిస్తాం.– శ్రీరామోజు శశికాంత్

మట్టపల్లిలో విశేష పూజలు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం విశేషపూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, ఎదుర్కోలు మహోత్సవ చేపట్టారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడవీధుల్లో ఊరేగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పల్లకీ సేవను కృష్ణానది వద్ద ప్రహ్లాద ఘాట్‌కు తరలించి హారతి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

భువనగిరి : బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన సెల్ ఫోన్‌ను అప్పగించి ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన యానూష్ శుక్రవారం నల్లగొండకు వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్‌కు వచ్చి నల్లగొండ డిపోకు చెందిన సెమీ డీలక్స్ బస్సు ఎక్కాడు. యానూష్ తన సెల్ ఫోన్‌ను బస్సులో మర్చిపోయి నల్లగొండ బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయాడు. బస్సులో సెల్‌ఫోన్‌ను గుర్తించిన కండక్టర్ సీఎస్ రెడ్డి భువనగిరి బస్టాండ్‌కు వచ్చిన తరువాత విషయాన్ని స్థానిక కంట్రోల్‌కు వివరించారు. ఫోన్ మరిచి వెళ్లిపోయిన బంధువుకు సామాజిక కార్యకర్త కడారి వెంకటేశం సమక్షంలో ఫోన్‌ను అప్పగించారు. బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను అప్పగించిన కండక్టర్‌ను పలువురు అభినందించారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలు సీజ్

గరిడేపల్లి: మండల పరిధిలోని చవ్వారిగూడెం గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మిర్యాలగూడ శివారులోని తుమ్మడం గ్రామానికి చెందిన కొంత మంది చవ్వారిగూడెం గ్రామం నుంచి అనుమతులు లేని విత్తన బస్తాలను ఆటోలో తీసుకెళ్తుండగా నేరేడుచర్ల పట్టణ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఆరా తీయగా అనుమతులు లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈమేరకు గరిడేపల్లి మండలం వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్, హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు ఆధ్వర్యంలో చెవ్వారిగూడెం గ్రామానికి వెళ్లి తిప్పన రాంరెడ్డికి చెందిన గోదాంలో తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఉన్న 150బస్తాల వరి విత్తనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్, గరిడేపల్లి ఏఎస్ఐ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



దిర్శించర్ల గ్రామంలో పట్టుబడిన వరి విత్తనాలపై విచారణ చేస్తున్న పోలీసులు

దిర్శించర్లలో 273 క్వింటాళ్లు పట్టివేత

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన ఎస్‌కె జలీల్‌కు చెందిన షెడ్డులో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 273 క్వింటాళ్ల వరి విత్తనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్, వ్యవసాయ అధికారి జావిద్ తనిఖీలు చేసి, వాటిని పట్టుకున్నారు. ఈమేకు షెక్ జలీల్‌పై కేసు నమోదు చేసి, వరి విత్తనాలను పరీక్షల నిమిత్తం విత్తనాల ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. నింధితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

22న ఉమ్మడి జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుర జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, అధ్యక్షుడు బండారు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1-1-2009 నుంచి 31-12-2011 మధ్య జన్మించిన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లా వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని తెలిపారు. క్రీడాకారులు వారి ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు, ఫుట్‌బాల్ కిట్ తో హాజరు కావాలని కోరారు. నల్లగొండలో ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 28 నుంచి జూలై1వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళల సంచారం

మోత్కూరు : అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని ముశిపట్ల గ్రామంలో వెలుగులోకి వచ్చింది. గురువారం గ్రామంలో దొంగతనానికి రెక్కి నిర్వహిస్తున్న నలుగురు మహిళలను గ్రామస్తులు గుర్తించి పట్టుకొని ఆరా తీశారు. మధ్యాహ్న సమయంలో గ్రామంలో సంచరిస్తుండగా అనుమానం వచ్చిన పలువురు గ్రామస్తులు వారిని ప్రశ్నించి నిలదీశారు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో అనుమానం బలపడింది. ఈ క్రమంలో వారు తప్పించుకునే ప్రయత్నం చేయగా గ్రామపంచాయతీ వద్దకు తీసుకెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నలుగురు మహిళలను విచారించారు. వరంగల్ జిల్లాకు చెందిన వాసులుగా గుర్తించారు. వరంగల్‌లోని రెడ్డినగర్, హన్మకొండ, కాజీపేట, మడికొండలకు చెందిన తుర్పతి మైసమ్మ, స్వాతి, శారద, సునీతగా పోలీసులు గుర్తించారు. వారిపై ఇప్పటికే నాలుగు దొంగతనం కేసులు నమోదైనట్లు ప్రొబెషనరీ ఎస్ఐ నోయల్ రాజు తెలిపారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

మోత్కూరు : పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దాచారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు అండెం కరుణాకర్‌రెడ్డి గురువారం తన పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బాలమణి, ఓ కుమార్తె ఉన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన అంత్యక్రియలో కుమార్తె శృతి తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టింది.

పుస్తెలతాడు చోరీ

నార్కట్‌పల్లి : మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతనేనిపల్లి గ్రామానికి చెందిన కమ్మంపల్లి స్వామి, అతడి భార్య అండాలు టీవీఎస్ ఎక్సెల్‌పై నార్కట్‌పల్లికి వస్తుండగా వెనక నుంచి బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అండాలు మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కెళ్లాడు. ఆ పుస్తెలతాడు రోల్డ్‌గోల్డ్ అయినా, దానికి పావుతులం బంగారం పుస్తె, పావుతులం బంగారు గుండ్లు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. స్వామి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయులు

- తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులు

అడ్డగూడూరు: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్ల లను తాము చదువు చెబుతున్న పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. అడ్డగూడూరు మండల పరిధిలోని అజీంపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు నరేష్‌కు కుమార్తె రిషక, కుమారుడు రిషిదేవ్ ఉన్నారు. శుక్రవారం కుమార్తె రిషికను అదే పాఠశాలలోని 3వ తరగతిలో, కుమారుడు రిష్‌దేవ్ 2తరగతిలో చేర్పించారు. గతంలో వీరు తిరుమలగిరి మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివేవారని, విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసానికి దోహదపడే బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



అజీంపేట పాఠశాలలో తన కుమార్తె, కుమారుడితో ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేష్

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా..

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని మక్తా కొత్తగూడెం గ్రామానికి చెందిన మట్టపల్లి సైదులు ఏపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తన కుమారులైన గణ సాత్విక్, మంజిత్‌లను తాను పనిచేస్తున్న పాఠశాలలోనే శుక్రవారం చేర్పించారు. అనంతరం వారికి ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్, స్కూల్ యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేందుకే తన ఇద్దరి కుమారులను ఈ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు